క్లుప్తంగా

పరిశుభ్రత పాటించాలి

మధిర: స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా నేడు(ఆదివారం) ఉదయం 10 గంటలకు ఒక గంట పాటు పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొనాలని మున్సిపల్ కమిషనర్ అంబటి రమాదేవి శనివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రతీ ఒక్కరు శ్రమదానం చేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజలు అందరూ భాగస్వాములు కావాలని సూచించారు.

ప్రతిభ చాటిన విద్యార్థులు

మధిర: శుక్రవారం విడుదల చేసిన కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రన్స్ టెస్ట్ 2023 సీట్ అలాట్‌మెంట్‌లో మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సీట్లు సాధించారు. కె పుల్లమ్మ, ఎల్ దివ్య హైదరాబాద్ కోటి ఉమెన్స్ కాలేజీలో ఎకనామిక్స్ విభాగంలో సీటు సాధించగా, ఎస్‌కె సైదా వరంగల్ కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్‌లో, ఎం.శివాని, ఎం రాకేష్ కుమార్ సుబేదారి కాకతీయ యూనివర్సిటీలో సీట్లు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఏఎల్ఎన్ శాస్త్రీ, వైస్ ప్రిన్సిపల్ రవికుమార్ తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను పలువురు అభినందించారు.

విద్యార్థికి ల్యాప్‌టాప్ వితరణ



ల్యాప్‌టాప్ అందజేస్తున్న సత్యనారాయణరెడ్డి

ఎర్రుపాలెం: మండలంలోని రేమిడిచర్ల గ్రామానికి చెందిన మాలోత్ అరవింద్ నాయక్ వారణాసిలో ఐఐటీ చదువుతుండగా దండెం సత్యనారయణరెడ్డి రూ.40వేల విలువ చేసే ల్యాప్‌టాప్‌ను శనివారం వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.గోపాలకిషన్‌రావు, మాజీ సర్పంచ్ సామినేని రామారావు, సొసైటీ సీఈఓ రామిశెట్టి ఏసుబాబు, అధ్యాపకులు వై.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న పాపారావు

బోనకల్: మండలంలోని జానకీపురం గ్రామానికి చెందిన ఎన్నెబోయిన నరసింహారావు ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబానికి జిల్లా ముదిరాజ్ సంఘం నాయకులు డాక్టర్ శీలం పాపారావు రూ.20 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, కొప్పెర వెంకటనర్సయ్య, రెడ్డిబోయిన ఉద్దండు, గోగుల కృష్ణయ్య, నారాయణ, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.


ఆటో యూనియన్ కమిటీ ఎన్నిక

వేంసూరు: మండల పరిధిలోని మర్లపాడులో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం జరిగిన సమావేశంలో ఆటో యూనియన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ ప్రెసిడెంట్‌గా బొందల చిట్టిబాబు, సెక్రెటరీగా ఎస్‌డీ.రియాజ్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి పిల్లి భాస్కర్‌రావు మాట్లాడుతూ... ఆటో కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామారావు, చిన్నపుల్లయ్య, సుధాకర్, యాకోబ్, మల్లయ్య, గోపి, సునీల్ చార్లెస్ పాల్గొన్నారు.

ఇసుక లారీలు, ట్రాక్టర్ స్వాధీనం

ముదిగొండ: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక లారీలు, ఒక ఇసుక ట్రాక్టర్‌ను మైనింగ్ అధికారులు చిరుమర్రిలో శనివారం పట్టుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రా ప్రాంతం నుంచి ఖమ్మంకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీలు, ట్రాక్టర్‌ను అధికారులు పట్టుకుని ముదిగొండ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని గీతాజ్ఞాన మందిరంలో శ్రీపార్థసారథి స్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లగుళ్ల నిర్మల, నర్సింహారావు, శ్రీదేవి, నారాయణరావు, పి.రూప్‌కుమార్, వైదేహి దంపతులు, సింధూజలు భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు గుడివాడ వెంకటేశ్వరరావు, ఏపూరి పురుషోత్తం, తిరునగిరి వెంకటనర్సయ్య, రాఘవయ్య, పుష్పావతి, సత్యావతి, పద్మ, ఝాన్సీ పాల్గొన్నారు.

బంతిలాంటి బత్తాయి..



బత్తాయిపండులో సుగుణాలు మెండు

- ఉపాధిగా జ్యూస్ తయారీ
- తోపుడు బండ్లపై విక్రయాలు
- పోషకవిలువలు, ఔషధ గుణాలతో ఆరోగ్యం

సండే స్పెషల్



తల్లాడ: సీజన్‌ను బట్టి వ్యాపారం చేస్తుంటారు కొందరు చిరు వ్యాపారులు. వర్షాకాలంలో బత్తాయి జ్యూస్ తయారీ వ్యాపారం చిరు వ్యాపారులకు ఉపాధిగా మారింది. తక్కువ పెట్టుబడితో వ్యాపారం చేసుకోవాలంటే ఇది మంచి మార్గం. ఈ సీజన్‌లో సాధారణంగా జ్వరాలు తగిలి నీరసమవుతుంటారు. అలాంటి వారికి ఏం తినాలనిపించదు. వైద్యులు కూడా బత్తాయి జ్యూస్‌ను తాగించమని చెబుతుంటారు. ఈ జ్యూస్‌లో పోషక విలువలు ఎక్కువగా ఉండటం, తియ్యగా, పుల్లగా ఉండటం, తేలికగా జీర్ణమౌతుండటంతో అందరూ ఇష్టపడుతున్నారు.

చిరువ్యాపారులకు ఉపాధి..

తోపుడు బండ్లపై తక్కువ పెట్టుబడితో వ్యాపారం చేసుకుంటూ చిరువ్యాపారులు ఉపాధి పొందుతున్నారు. ఓ చెట్టు కింద, షాపు ముందో తోపుడు బండి ఏర్పాటు చేసుకొని దానిపై కాయలు పోసి మినీ మిషన్లతో జ్యూస్ తయారు చేస్తున్నారు. ఇలా వైరా, తల్లాడ, సత్తుపల్లి, మధిర ప్రాంతాల్లో పదుల సంఖ్యలో బత్తాయి జ్యూస్ బండ్లు వెలిశాయి. రూ.30 వేలు పెట్టుబడి పెడితే రోజుకు రూ.500 నుంచి రూ.1,500 వరకు సంపాదన ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు. బత్తాయిలను ఇక్కడ వ్యాపారులకు బయట నుంచి వ్యాన్‌లో తీసుకొచ్చి వారి వద్దకే వచ్చి వేసి వెళ్తున్నారు. క్వింటా రూ.3,000 చొప్పున దిగుమతి చేసుకుంటున్నారు.



బత్తాయి జ్యూస్ విక్రయిస్తున్న మహిళా వ్యాపారి

ఆరోగ్యానికి, శక్తికి మంచి జ్యూస్

బత్తాయి జ్యూస్ అటు ఆరోగ్యానికి సత్వరమే శక్తి పొందేందుకు దోహదం చేస్తుంది. వర్షాకాలంలో జ్వరాల బారిన పడ్డ వారికి ఈ జ్యూస్ అమృతంలాగా పని చేస్తుందని చెప్పటంలో ఎలాంటి సందేహం లేదు. గ్లాస్ జ్యూస్ రూ.20 నుంచి రూ.30 వరకు విక్రయిస్తున్నారు. ఈ జ్యూస్‌లో పోషక విలువలు ఎక్కువగా ఉండటంతో అందరికీ మంచి ఆరోగ్యానికి దోహదం చేస్తుంది. ముఖ్యంగా జ్వరాలు, జలుబు వచ్చినప్పుడు త్వరగా కోలుకోవటానికి ఈ జ్యూస్‌ను అందిస్తుంటారు.

పోషకవిలువలు.. ఔషధగుణాలు

- బత్తాయిలో విటమిన్ సీ ఎక్కువ పాళ్లలో ఉంటుంది.
- ఈ పండుకున్న తీపి వాసన లాలాజలగ్రంథుల్ని ప్రేరేపించి లాలాజలం అధికంగా ఊరేందుకు కారణమవుతుంది.
- తీసుకున్న ఆహారం త్వరగా జీర్ణమై రక్తంలో వెంటనే కలిసి పోతుంది.
- మలబద్ధకాన్ని నివారిస్తుంది. అందులోని ఆమ్లాలు పేగుల్లోని విష పూరిత పదార్థాలను బయటకు పారదోలి అజీర్తిని తగ్గిస్తుంది.
- కామెర్లు వచ్చిన వారికి ఈ జ్యూస్ మంచిది.
- బత్తాయిజ్యూస్‌తో చిగుళ్ల నొప్పులు, గొంతు సంబంధిత వ్యాధులు తగ్గుముఖం పడతాయి.
- ప్రతీ రోజు ఈ జ్యూస్ తాగడం వల్ల గుండె పనితీరు మెరుగుపడి చర్మ సౌందర్యానికి ఉపయోగపడుతుంది.

గిరాకీ బాగుంది..



బత్తాయి జ్యూస్ విక్రయాలు బాగానే ఉంది. రోజుకు రూ.1000 నుంచి రూ.1,500 వరకు మిగులుతున్నాయి. సీజన్ కావడంతో విక్రయాలు బాగానే ఉంటున్నాయి. క్వింటా రూ.3 వేల వరకు ధర పలుకుతున్నా కాయలు, పంచదార , ఐస్ ఖర్చు పోను రోజు కూలీ కంటే ఎక్కువగానే గిట్టుబాటవుతుంది.

– బయ్యవరపు మురళీకృష్ణ, తల్లాడ, తోపుడు బండి వ్యాపారి

బత్తాయి జ్యూస్‌తో లాభం



సీజన్‌ను బట్టి వ్యాపారం చేస్తుంటాను. వేసవిలో నిమ్మకాయ సోడా విక్రయిస్తుంటాను. వర్షాకాలంలో బత్తాయి జ్యూస్ విక్రవిస్తుంటాను. బత్తాయి జ్యూస్ వల్ల రోజు కూలీ గిట్టుబాటవుతుంది. బత్తాయి కాయలు మా వద్దకే వచ్చి వేసి వెళ్తుండటం వల్ల వ్యాపారం చేసేందుకు సమయం కలిసొస్తుంది.

– షేక్ మైబూబ్‌బీ,చిరు వ్యాపారి, మల్లవరం,

అనుకూలంగా ధరలు..



బత్తాయి జ్యూస్ ఆరోగ్యానికి ఎంతో మంచిది. సత్వర శక్తి నిచ్చే జ్యూస్‌ను అన్ని వయస్సుల వారు ఇష్టపడతారు. తేలికగా జీర్ణం అవుతుంది. తియ్యగా, పుల్లగా ఉండి రుచి కూడా బాగుంటుంది. ఈ జ్యూస్‌లో పోషకాలు ఎక్కువగా ఉండటం, ధర కూడా అనుకూలంగా ఉండటంతో అందరూ ఇష్టపడుతున్నారు.

– మారుతి వెంకటేశ్వర్లు, తల్లాడ

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న సాంబశివరావు

ఎర్రుపాలెం: బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు మరింతగా కృషి చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి చిలివేరు సాంబశివరావు సూచించారు. శనివారం మండలకేంద్రంలో ప్రవాస్ యోజనలో భాగంగా కార్యకర్తల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపై నాయకులు, కార్యకర్తలు సమర్థవంతంగా పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షుడు ముక్కపాటి శ్రీనివాసరావు, నాయకులు దేవరకొండ కోటేశ్వరరావు, పుష్పాల చంద్రమౌళి, మిరియాల వెంకటేశ్వర రావు, మల్లెల మోహన్ రావు, శివమణి రెడ్డి, ప్రధాన కార్యదర్శి పిట్టల గోపాలరావు, వేములకొండ రామకృష్ణ, బాణావత్ ప్రేమ్ కుమార్, బొక్క రమేష్, అచ్చారావు, గరికపాటి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ సేవలు అభినందనీయం

మధిర: ఎంఈఓగా వై.ప్రభాకర్ సేవలు అభినందనీయమని ఎంపీడీఓ సిలార్ సాహెబ్ అన్నారు. మధిర ఎంఈఓగా ప్రభాకర్ పదేళ్ల సర్వీసు పూర్తిచేసుకోగా, స్థానిక మానవ వనరుల కేంద్రంలో ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు శనివారం ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఇబ్బంది ఎదురుకాకుండా, బోధనలో లోటుపాట్లు లేకుండా ఎంఈఓ చేసిన సేవలు స్ఫూర్తిదాయకమని తెలిపారు. అనంతరం ప్రభాకర్ మాట్లాడగా ప్రధానోపాధ్యాయులు ఎస్.విజయశ్రీ, మురళి మనోహర్, చెరుపల్లి శ్రీహరి, ఉపాధ్యాయులు సాయికృష్ణ, మేడేపల్లి శ్రీనివాసరావు, రామకృష్ణ సీఆర్పీలు బాబురావు, సీహెచ్.ప్రభాకర్, జయాకర్, నాగేశ్వరరావు, ఎస్.స్వరూప, రాంబాబు, ప్రవీణ పాల్గొన్నారు.



ఎంఈఓను సన్మానిస్తున్న సిబ్బంది

పొగాకు అనర్థాలపై అవగాహన

మధిరరూరల్: మండలంలోని మాటూరు హైస్కూల్‌లో పొగాకు అనర్థాలపై శనివారం అవగాహన కల్పించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల సైన్స్ టీచర్ ఆర్ బి.శ్రీనివాసరావును టొబాకో ఫ్రీ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూట్ మాటూరు నోడల్ అధికారిగా నియమించారు. పొగాకు వల్ల నష్టాలపై అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. ప్రధానోపాధ్యాయులు చెరుపల్లి శ్రీధర్ ఉపాధ్యాయులు సాయి కృష్ణమాచార్యులు, శ్రీనివాసరావు, మేడేపల్లి శ్రీనివాసరావు, ఆదాం, ప్రసాద్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల శ్రమదానం

ముదిగొండ: దేశ స్వచ్ఛత కోసం శ్రమదానం కార్యక్రమాన్ని శనివారం ముదిగొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు నిర్వహించారు. కళాశాల నుంచి ముదిగొండ బస్టాండ్ వరకు వీధుల వెంట ఉన్న ప్లాస్టిక్ కవర్లు, చెత్తను తొలగించారు. ప్రజలకు అపరిశుభ్రత వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం ముదిగొండ సెంటర్‌లో మానవహారం నిర్వహించి స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.శ్రీనివాస్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకట్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడలకు విద్యార్థులు ఎంపిక

తల్లాడ: పాఠశాల జోనల్ క్రీడల్లో బాలభారతి విద్యాలయానికి చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను శనివారం విద్యాసంస్థల కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్ అభినందించారు. వాలీబాల్ అండర్ 17లో పి.కావ్య, విభాగంలో సి.హెచ్.శ్రావణి, లాంగ్ జంప్‌లో సి.కావ్య, కోకో అండర్ 14లో ఎస్.నిశాంత్ ఎంపికైనట్లు తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను ఎంఈఓ ఎస్.దామోదరప్రసాద్, కేఎస్ఎం కళాశాల ప్రిన్సిపాల్ తాళ్లూరి రామారావు, పీఈటీలు సైదా, సతీష్ పాల్గొన్నారు.



విద్యార్థులతో కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్

సన్మానం

వైరారూరల్: మండలంలోని విప్పలమడక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాసరి వెంకటేశ్వర్లు ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందిన సందర్భంగా శనివారం పంచాయతీ పాలకవర్గం, గ్రామస్తులు దాసరిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. సర్పంచ్ తుమ్మల జాన్‌పాపయ్య, ఎంపీటీసీ బుర్గు సంజీవరావు, నాయకులు దొంతెబోయిన సత్యనారాయణ, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

మెడికల్ సీటు సాధించిన అక్కాచెల్లెళ్లకు..



అక్కాచెల్లెళ్లను సన్మానిస్తున్న దృశ్యం

వైరామండలంలోని తాటిపూడి గ్రామానికి చెందిన ముచ్చుపోతుల మౌనిక, సాయిప్రియ అక్కాచెల్లెలు ఇటీవల మెడిసిన్ సీట్లు సాధించిన సందర్భంగా రెబ్బవరం జెడ్పీహెచ్‌ఎస్ పూర్వ విద్యార్థులు శనివారం ఇరువురిని ఘనంగా సన్మానించారు. అనంతరం రామయ్య, సక్కుబాయి దంపతులు రూ.1.50 లక్షలు, రిటైర్డ్ హెచ్‌ఎం సామ్రాజ్యం రూ. 20 వేలు, బీఎస్‌ఎన్‌ఎల్ రిటైర్డ్ ఉద్యోగి రూ. 20 వేలు, రెబ్బవరం జెడ్పీహెచ్‌ఎస్ పూర్వ విద్యార్థి రంగా వెంకటేశ్వర్లు, మంద పుల్లయ్య రూ. 20 వేల వేల చొప్పున అందజేశారు. అదే విధంగా సాయిప్రియకు అయ్యే చదువు ఖర్చు మొత్తాన్ని తానే భరిస్తానని జెడ్పీహెచ్‌ఎస్ పూర్వ విద్యార్థి కొల్లి రామారావు ప్రకటించారు. హెచ్‌ఎం శివన్నారాయణ, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కల్లూరుకు చేరిన బతుకమ్మ చీరలు



కల్లూరు రూరల్: దసరా పురస్కరించుకొని మహిళలకు అందజేస్తున్న బతుకమ్మ చీరలు శనివారం కల్లూరుకు చేరాయి. వైరా గోదాం నుంచి వచ్చిన ఈ చీరలను ఐకేపీ కార్యాలయానికి రాగా తహసీల్దార్ బాబ్జిప్రసాద్, ఎంపీడీఓ రవికుమార్ , ఐకేపీ ఏపీఎం వెంకటరామారావు పరిశీలించి భద్రపరిచారు.

మంత్రి కేటీఆర్‌కు ఘన స్వాగతం..



సత్తుపల్లిలో శంకుస్థాపనలో పాల్గొన్న మంత్రులు కేటీఆర్, పువ్వాడ, ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి/సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనకు వచ్చిన మంత్రి కేటీఆర్‌కు ఘన స్వాగతం పలికారు. హెలికాప్టర్‌లో సత్తుపల్లి చేరుకున్న మంత్రులు కేటీఆర్, పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు నామా నాగేశ్వరరావు, బండి పార్థసారథిరెడ్డి, వద్దిరాజు రవిచంద్రలను ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య జేవీఆర్ డిగ్రీ కళాశాల హెలీప్యాడ్‌వద్దకు చేరుకొని ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి డీసీసీబీ గెస్ట్‌హౌస్‌కు చేరుకున్న మంత్రులు కొద్దిసేపు భోజన విరామం చూసుకొని శంకుస్థాపన కార్యక్రమాలకు బయలుదేరి వెళ్లారు. పాత ఎన్టీఆర్ కాలువ వద్ద పైలాన్‌ను ఆవిష్కరించి అక్కడి నుంచి సభావేదిక వద్దకు చేరుకున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు మోటారు సైకిళ్ల ర్యాలీతో ఘన స్వాగతం పలికారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంత్రి కేటీఆర్‌కు మధ్యాహ్న భోజన కార్మికులు, అంగన్‌వాడీ టీచర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, గెస్ట్ లెక్చరర్లు, ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాలు అందించారు. తిరిగి సాయంత్రం 5.35 గంటలకు సత్తుపల్లి నుంచి బయలుదేరారు.

కేటీఆర్ సభకు తరలిన కార్యకర్తలు

కల్లూరు రూరల్: సత్తుపల్లిలో నిర్వహించే శనివారం మంత్రి కేటీఆర్ సభకు కల్లూరు మండలం నుంచి బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఆటోలు, కార్లు, మోటారు సైకిళ్లపై భారీ సంఖ్యలో తరలివెళ్లారు. మండలాధ్యక్షుడు పాలెపు రామారావు, ఎంపీపీ బీరవెల్లి రఘు, జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, రైతు సమితి కన్వీనర్ డాక్టర్ లక్కినేని రఘు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఇస్మాయిల్ తదితరులు గ్రామాల నుండి జనసమీకరణ చేసి పలు వాహనాల్లో సత్తుపల్లి సభకు తరలించారు.



కల్లూరురూరల్: సభకు వెళ్తున్న కార్యకర్తలు

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ

ముదిగొండ: మండలపరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ సామినేని హరిప్రసాద్ అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. సమావేశంలో శాఖల వారీ నివేదికలు చదవడమే సమయానికి సరిపోయింది. అరకొరగా హాజరైన ప్రజాప్రతినిధులు వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి చేతులు దులుపుకున్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం పర్మినెంట్ చేయడంతో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ పసుపులేటి దుర్గ, ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఎంపీఓ సూర్యనారాయణ, ఏఓ రాధ, ఏఈలు నారాయణ, విజయరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సామాజిక స్పృహతో మెలగాలి

కారేపల్లి: ప్రతి ఒక్కరూ సమాజంలో సామాజిక స్పృహతో మెలగాలని సింగరేణి తహసీల్దార్ సురేష్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని పేరుపల్లి గ్రామంలో షెడ్యూల్ కులాల ప్రజలకు పౌరహక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని, అక్టోబర్ 4న ప్రతీ పోలింగ్ బూత్ కేంద్రాల్లో ఓటర్ జాబితాను ప్రదర్శించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, సర్పంచ్ అజ్మీరా నాగేశ్వరరావు, కార్యదర్శి నిరంజన్, సాంఘిక సంక్షేమ శాఖ సిబ్బంది కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సురేష్‌కుమార్

కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడాలి

వైరా: మహాత్మాజ్యోతీ బాపూలే స్ఫూర్తితో ఉద్యమించి కుల మత వివక్షకు వ్యతిరేకంగా పోరాడాలని సీపీఐ ఎంఎల్ ప్రజా పంథా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆవుల అశోక్, కంకణాల అర్జునరావు అన్నారు. జ్యోతీబా పూలే స్థాపించిన సత్య శోధక్ సమాజ్ 150 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వైరాలో కుల వ్యతిరేక పోరాట సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాసిస్టు మత రాజకీయాలను స్థాపించాలని కొంత మంది పన్నాగాలు చేస్తున్నారని కమ్యూనిస్టు విప్లవ శక్తులు ఐక్యమై కుల నిర్మూలన చైతన్యానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రతాప్, సైదుబాబు, మరియమ్మ, లాలమ్మ, ఈశ్వరి, భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆవుల అశోక్

నాయకుల ముందస్తు అరెస్టు

వైరా: రాష్ట్ర ఐటీ, పురపాలక పరిశ్రమల శాఖా మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా వైరాలోని పలు పార్టీల నాయకులను పోలీసులు శనివారం ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. నాయకులు పాదిల హరినాద్, ఏదునూరి సీతారాములు, కంకణాల అర్జునరావులతో పాటు టీడీపీ, సీపీఐ, సీపీఎం నాయకులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

కొణిజర్ల: మండలంలోని ఎల్లన్న నగర్‌కు చెందిన పోడు సాగుదారులు, ఉద్యమ నాయకులు ఎనిమిది మందిని, కొణిజర్ల సర్పంచ్ సూరంపల్లి రామారావు నేతృత్వంలో 21 మంది కాంగ్రెస్ కార్యకర్తలను, సీపీఐ, సీపీఎం, టీడీపీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించి సభ అనంతరం వ్యక్తిగత పూచికత్తుపై విడుదల చేశారు.

తల్లాడ: నాయకుల అరెస్టును నిరసిస్తూ కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు నిరసన ప్రదర్శన చేశారు. కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్, రాగమయి పాల్గొని మాట్లాడారు. అరెస్టయిన వారిలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పాకా సుధాకర్, పట్టణాధ్యక్షుడు దగ్గుల నాగిరెడ్డి, యర్రి నరసింహారావు, కటికి కిరణ్, ధర్మసోత్ దశరథ్ నాయక్, నాయకులు అయినాల రామలింగేశ్వర్‌రావు, ఎస్.కె.లాల్‌మియా, పైడిపల్లి రవి, వడ్డే రామారావు పాల్గొన్నారు.

కల్లూరు రూరల్: కాంగ్రెస్ మండల నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి ఏన్కూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పెద్దబోయిన దుర్గాప్రసాద్, నాయకులు యాసా వెంకటేశ్వరరావు, యంగల సురేష్, బి.చిట్టిబాబు, రంగ, చందూనాయక్ లను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కొండూరి సుధాకర్ పోలీసు స్టేషన్‌కు వెళ్లి వారికి సంఘీభావం తెలిపారు.

ముదిగొండ: ముదిగొండలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సుధాకర్, యువజన కాంగ్రెస్ నాయకుడు నాగులుమీరాలను ముదిగొండ పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.



వైరా: పోలీసుల అదుపులో నాయకులు



తల్లాడ: నిరసన తెలుపుతున్న నాయకులు



కొణిజర్లలో..



కల్లూరు రూరల్: పోలీస్ స్టేషన్‌లో సంఘీభావం తెలుపుతున్న కొండూరి సుధాకర్